# పసితనంలో కన్నవారి ప్రేమ కరువైనప్పుడు

"ఆంటీ నాకు ఏభయి రూపాయలు కావాలి."

"నిన్న పుస్తకాలకూ ఫీజుకూ తీసుకున్నావుగా?"

"నిన్న ఒకపుస్తకం దొరకలేదు, ఇంకొకషాపులోఉందని నా స్నేహితుడు చెప్పాడు. వెంటనే తీసుకోకపోతే ఎవరో కొనేసుకుంటారు తొందరగా ఇవ్వు."

"పన్నెండు కావచ్చింది భోజనంచేసి వెళ్ళరాదూ?"

"మళ్ళీవస్తాలే ఇంతకూ ఆయన ఎప్పుడువస్తాట్ట?"

"నీతో చెప్పలేదా? రేపు సాయంత్రం వస్తానన్నాడు. మళ్లీ తొందరగా వెళ్ళిపోతానన్నాడు. నీముందేగా చెప్పింది? అయినా అబ్బాయీ ఒక్కమాట. అయినను నీవు అంత తీసిపారేసినట్టు మాట్లాడకూడదు. ఎంతయినా తండ్రిలాంటి మనిషి. ఆయన ఎప్పుడువచ్చినా పరాయివాడిని చూసినట్టు చూస్తావు. నీవు పెద్ద వాడి వవుతున్నావు. కొంచెం మర్యాదగా మాట్లాడటం నేర్చుకో."

"నన్ను మాటల్లోదింపకు నాకు డబ్బుకావాలి. ఆ పుస్తకం ఎవరైనా కొనుక్కు పోతారు."

"ఇదిగో డబ్బు కాని-భోజనంచేసివెళ్ళు. ఇంకా నేనుకూడా భోజనం చెయ్య లేదు. రా వడ్డిస్తాను"

"నీవు తినెయ్యి."

"నీవు చిన్నవాడివి భోజనం చేయకుండాఉంటే నేనెట్లాచేస్తాను? నాకు తినాలని పిస్తుందా చెప్పు?"

"నాన్నెన్ను, నేను చిన్నవాడినయితే నీవు తినటానికేం? నీవు భోజనం చెయ్యి"

"అది కాదు కుందన్ నిన్ను పసిపిల్లవాడుగా ఉన్నప్పటినుంచీ పెంచు తున్నాను. చిన్నవాడివి నీవు తినకుండా నేను తినగలనా? నిన్ను పెంచిన ప్రేమ నా మనసునిండాఉంది. నీవు బాగాచదువుకుని పెద్ద ఉద్యోగంచేస్తూ పెళ్ళిచేసు కుంటే చూడాలనిఉంది. మీ యిద్దరినీచూసి ఎంతో సంతోషిస్తాను.

"ఏమిటేమిటి? నీవు నన్ను నెలపిల్లవాడిదగ్గర్నుంచీ పెంచావా? నీకేంపట్టింది పెంచటానికి? అందరినీ కన్నవాళ్ళు పెంచుతారట మా స్నేహితుడన్నాడు. వాళ్ళే మయ్యారు? ప్రతిదానికీ ఆయన డబ్బిస్తాడంటావు ఆయనెవరు? నీ మాటలు నమ్మతగ్గవిగాలేవు. నేనేమయినా కుంతీ పుత్రుడినాచెప్పు? నా సంగతే నాకర్థం కావటంలేదు" కుందన్ కనుబొమలు ముడిచాడు.

"నీకు కుంతీపుత్రుడంటేకూడా అర్థం తెలిసిందా?''

"ఒకరు చెప్పాలా? చదువుతుంటే అన్నీ తెలుస్తాయి''

"అయితే-ఇప్పుడు నీసంగతేం బాగుండలేదు గాని-పుస్తకం కొనుక్కురా. నేనాగుతాలే, నీవువచ్చినతరువాతనే భోజనంచేద్దాం. అప్పటికి కొంత శాంత పడతావు"

కుంతీ పుత్రుడనగానే ఆమెకు కొంత బాధ కలిగినమాటనిజమే. కాని-అత డికి చెప్పినా ఇప్పుడర్థంకాదు 'సమయం రావాలి' అనుకుని లోపలికి వెళ్ళుతూ కళ్లు తుడుచుకుంది.

చంపకం పరిస్థితి మొదటినుంచీ వింత పరిస్థితే. ఇంటర్మీడియేట్ చదువు తుండగా ఒక ఆర్మీ ఆఫీసర్ను పెళ్ళిచేసుకుంది. కాని రెండు సంవత్సరాలు ఏం సుఖంగాఉందో అంతే అతడు చనిపోయాడు. తోడుగా ఉండటానికయినా ఎవరూ లేక ఆ మహానగరంలోనే ఒక ఇల్లు కొనుక్కుని ఇరుగుపొరుగుల స్నేహంతో బి.ఏ చదివి, బి.ఇడికూడాచేసి టీచరుగా పనిచేస్తున్నది. పది సంవత్సరాలసర్వీసు అవుతుండగా, ఆమె పినతల్లికూతురు శకుంతల, ఆమె పెనిమిటి సుమిత్రానందన్ అమెరికా వెళ్ళుతూ నెలపిల్లవాడిని చంపకానికిచ్చి నాలుగేళ్ళల్లో వస్తామనిచెప్పి వెళ్లారు. పిల్లవాడికి అవసరమైనంతడబ్బు బ్యాంకిలోపెట్టారు. చంపకం తనను ఆంటీ అని అతడికి మాటలు వచ్చినప్పటినుంచీ పిలిపించుకుంటున్నది. ఆమె ఉద్యోగం చాలించుకుని కుందనే సర్వస్వమని ప్రేమతో పెంచుతున్నది.

సుమిత్రానందన్ శకుంతలలకు నాలుగు సంవత్సరాలలో అనుకున్నపని కాలేదు. రెండేళ్లు మూడేళ్లనుకుంటూ పది సంవత్సరాలు గడిపారు. శకుంతల తిరిగి రాలేకపోయింది. కాని సుమిత్రానందన్ అప్పుడప్పుడువచ్చి కుందన్‌కి అవసరమైనబట్టలు ఆటవస్తువులూ కొనిఇచ్చేవాడు. వచ్చినప్పుడు ఒకరోజుమాత్రమే ఉండేవాడు. కుందన్‌తో మాట్లాడుతూఉండేవాడు. కాని కుందన్‌కి ఆయనపట్ల గౌరవంగాని ప్రేమగాని కలగటంలేదు. పైగా చికాకుగా ఉండేది.

"నీవంటి కొడుకుఉన్నాడోయ్ నాకు. అందుకని ఇవన్నీ తెస్తూఉంటాను. నీవు ముఖమాటపడకు" అని దగ్గర కూర్చోబెట్టుకునేవాడు. ఆరోజు వాళ్ళింట్లోనే భోజనం చేసేవాడు. సుమిత్రానందన్‌కి ఒకటే ఆలోచన. ఇప్పుడే నీ తల్లి అక్కడుందని కాని-తనేతండ్రి అనిగానిచెబితే వస్తానంటాడేమో? చదువు ఎటూకాకుండా పోతుందని భయం. తల్లిదండ్రులిద్దరూ కలిసివచ్చినప్పుడే చెప్పవచ్చు ననుకున్నాడు.

కాని-కుందన్‌పరిస్థితి వేరుగాఉంది. అతడిలో అనేకరకాల ప్రశ్నాపరంపర ఉదయించి మనసును కల్లోలపరుస్తున్నది.

"అందరికీ అమ్మా నాన్నా ఉన్నారు. నా స్నేహితులు ఇళ్ళకు వెళ్ళగానే 'నాయనా'అంటూ తల్లులు చేతులతో పొదువుకుని తీసుకువెళ్ళి భోజనం పెడతారు. పొద్దునలేవగానే "బంగారుతండ్రీ! లేచావా? తొందరగా ముఖంకడుక్కొని స్నానం చెయ్యి. అన్నంతిని స్కూలుకు వెళ్లుదువుగాని" అంటారు. వాళ్ళతల్లి తండ్రులకు పిల్లలంటే ఎంతో ప్రేమ! అని లోలోపల కుమిలిపోతాడు.

ఒకరోజున స్నేహితుడియింటికి వెళ్ళితే అతడి తల్లీ తండ్రీ భోజనం చెయ్యమని బలవంతంచేశారు. ఆ స్నేహితుడి తండ్రి తమిద్దరిమధ్యా కూర్చుని అతడికి ఇష్టమైన తీపిపదార్థాలను బలవంతంగా తినిపించాడు. వాళ్ళింట్లో ఉన్నంత సేపూ బాగానేఉన్నాడు. ఇంటికివచ్చినప్పటినుంచీ తనకేదో వెలితిగాఉన్నట్టూ, తన జీవితంలో ఆ వెలితి అట్లాగే ఉంటుందన్నట్టూ ఒకభావన అతడిని కిందుమీదులు చేస్తున్నది. పది రోజులపాటు ఆ నరకయాతనను అనుభవించాడు మరిచిపోకుండా

అప్పటినుంచీ సరిగా చదువుమీద ధ్యాస నిలపలేదు. ఎప్పుడూ తన చదువూ ఆటలూ స్నేహితులూ-అంతేగాని వేరొకధ్యాస ఎరుగనివాడికి ఆ ముఖం మీద

నవ్వు మాయమైంది. స్నేహితులతో ఆటలూ మాటలూ లేవు. చికాకెక్కువయింది. మాటకు ముందు కోపమూ అరుపులూ-చంపకంతో సరిగ్గా మాట్లాడకపోవటమూ మొదలైంది. ఆయన వచ్చినప్పుడల్లా విసుగుపడుతూ ఉంటాడు.

ఆ సంవత్సరం పరీక్షలు దగ్గరికి వచ్చినప్పుడు సరిగా చదువుతాడో లేదో నని చంపకానికి భయంపుట్టింది. కుందన్ ఆమాటే మరిచిపోయినట్టుగా తిరుగుతూ ఉండేవాడు.

సుమిత్రానందన్‌కి ఆ దేశంలో ఇద్దరాడపిల్లలు పుట్టారు. వాళ్ళు మూడు నాలుగేళ్ళ వాళ్ళయిన తరువాత స్వదేశానికి రావటానికి నిశ్చయించుకున్నారు. చంపకం ఇంటికి దూరంగా ఒక పెద్దఇల్లు కొని తమకు తగిన వసతులు కల్పించ మని సుమిత్రానందన్ తన స్నేహితుడి ద్వారా ఏర్పాటు చేసుకున్నాడు

స్నేహితుల ప్రోద్బలంతో కుందన్ పరీక్షకు చదివాడు. కాని అతడి మొదటి ఆశయానికి తగినట్టుగా డిస్టింక్షన్‌తో విజయం సాధించలేకపోయాడు.

ఇంటర్మీడియేట్‌లో ప్రవేశించాడు.

పాత స్నేహితులు అతడిని వదలిపెట్టలేదు. వచ్చి అతడిని తమయిళ్ళకు తీసుకువెళ్ళుతూ ఉండేవారు.

"ఏమోయ్ కుందన్. ఈసారి పరీక్షలో నీవా నేనా మంచిమార్కులు తెచ్చు కునేది ?" అని అడుగుతూ ఉంటే ''ఒకప్పుడు నేనే ఫస్టురావాలనీ, బాగా కష్టపడి చదవాలనీ ఉండేది. కాని ఇప్పుడు "అసలు చదువుతానో లేదోననిపిస్తోంది" అన్నాడు పరధ్యానంతో

"ఒరే కుందన్ అంత ఉత్సాహంగా సరదాగా ఉండేవాడివి. ఇప్పుడిట్లా మాట్లాడుతున్నావేమిటి? అంత నిరుత్సాహం ఎందుకు కలిగింది నీకు? ఆ నిరాశ ఏమిటి ? ఉన్న ఏంబిషన్ను చంపేస్తున్నావు. నీలో ఏదో మార్పువచ్చింది.

"నాకెవరున్నారురా బాగా చదివినా చదవకపోయినా సంతోషించటానికి బాధపడటానికీను? '

''ఇదిగో కుందన్! ఎవరున్నా లేకపోయినా నీ చదువు నీవు చదువుకో నీకు అన్ని అవకాశాలూ ఉన్నాయి. ఎవరూ లేరని భవిష్యత్తును పాడుచేసుకుంటావా? బాగా చదువుకో. ఉద్యోగం చేసుకో నీ జీవితం నీదిగా భావించుకో"

ఆనాటినుంచీ కుందన్‌లో మళ్ళీ ఉత్సాహం పుంజుకుంది గాని తను 'ఏకాకి' నన్న భావం మనసులో పాతుకుపోయింది. ఏదోవిధంగా చదువుకోవాలి. ఇక్కడి నుంచి బయటపడాలన్న ధోరణి కలుగుతూ వచ్చింది. చంపకంతో చాలా ముక్త సరిగా మాట్లాడుతున్నాడు.

చంపకానికి ఉత్తరమైనా రాయకుండా సుమిత్రానందన్ కుటుంబం స్వంత ఇంట్లో దిగింది. ఆ సాయంత్రం సుమిత్రానందన్ భార్య శకుంతలతో చంపకం ఇంటికి వచ్చాడు.

అప్పుడే స్కూల్‌నుంచి వచ్చి కాఫీ టిఫిన్ తింటున్న కుందన్ వాళ్ళను చూసి దిగ్గునలేచి బైటికి వెళ్ళిపోయాడు.

శకుంతలా సుమిత్రానందన్ ముఖాలు చూసుకున్నారు.

"ఇదీ వరస కుందన్‌ది. ఈయనపట్ల విముఖత చూపిస్తాడు. చెప్పినమాట వినిపించుకోవటం లేదీమధ్య. ఏమాట మాట్లాడినా పెడార్థాలు తీస్తాడు. మీ అబ్బాయిని మీరు తీసుకువెళ్ళి మంచిచేసుకోండి. మిమ్మల్ని మీరే పరిచయం చేసుకోండి. ఒకరోజు 'నేను కుంతీపుత్రుడినా?' అని అడిగాడు. తనకెవరూ లేరనన్న భావం మనసులో బయలుదేరినట్లనిపిస్తోంది. వాడితో జాగ్రత్తగా మాట్లాడి దారిలోకి తీసుకురావాలి. తొందరపడితే లేతమనసు దెబ్బతింటుంది" అన్నది చంపకం.

శకుంతల కన్నీళ్ళు కార్చింది.

సుమిత్రానందన్‌కి మనసు కలుక్కుమన్నది.

"ఇంత మొండివాడైనాడా ?"

"నేనెంత గోప్యంగా పెంచినప్రేమతో దగ్గరికి తీసినా ఇటీవల వాడిమనసు దేనికోసమో వెంపరలాడటం గమనిస్తున్నాను. తనకు తల్లిదండ్రులు ఉన్నారా అన్నట్టు మాట్లాడుతున్నాడు. నా చేతనయినంతవరకూ వాడిమనసు బాధపడకుండా ఉండాలని ప్రయత్నిస్తూనే ఉన్నాను."

ఇద్దరూ వేడినిట్టూర్పులు విడిచారు.

సుమిత్రానందన్ కొంతసేపటికి తేరుకుని "ఇది మేము చేతులారా చేసుకున్నదే. కాని-ఆ సమయంలో మాకు గత్యంతరం లేక నీదగ్గర వదిలిపెట్ట

వలసి వచ్చింది. రాగానే పరిస్థితులు చక్కబడతాయనుకున్నాను. కొంతకాలం పడుతుందేమో ? ఈ లోపల ఎవరూ తొందరపడద్దు" అంటూ భార్యను తీసుకుని ఇంటికి వెళ్ళాడు.

శకుంతల మనసు కుదుటపడలేదు.

కుందన్ చంపకం ఇంట్లోనే ఉంటున్నాడు.

ఊరి మధ్యలో ఒకడాక్టరు తన నర్సింగ్ హోము అమ్మి అమెరికా వెళ్ళుతుంటే సుమిత్రానందన్ దానిని కొన్నాడు. తనదీ తనభార్యదీ నేమ్ ప్లేట్లు పెట్టాడు. తను ఉదయం ఎనిమిది గంటలనుంచీ ఒంటిగంటవరకూ ఉంటాడు. తిరిగి సాయంత్రం నాలుగు గంటలకువెళ్ళి ఎనిమిదిగంటలవరకూ ఉంటాడు.

శకుంతల పిల్లలనూ ఇంటినీ చక్కబెట్టుకుని, పిల్లలను ఇంటిదగ్గరే నౌకరు దగ్గర వదిలిపెట్టి, ఉదయం పదకొండు గంటలకు నర్సింగ్ హోమ్‌కి వెళ్ళి, స్త్రీలకూ పిల్లలకూ వైద్యం చేస్తున్నది మూడుగంటల వరకూ.

సుమిత్రానందన్ పిల్లలిద్దరు కవలపిల్లలు. వాళ్ళకు ఐదవఏడు వచ్చిన సందర్భంలో పుట్టినరోజు అట్టహాసంగా తలపెట్టారు.

శకుంతల ఆఈడు పిల్లలనందరినే కాకుండా హైస్కూలు, కొందరు కాలేజి పిల్లలను కూడా పిలిచింది. మగపిల్లలూ ఆడపిల్లలూ వందమందికిపైగా వచ్చారు. వాళ్ళల్లో కుందన్ అతడి స్నేహితులు కూడా ఉన్నారు.

ఆ క్రిందటి రోజు "ఆంటీ నాకు నూరురూపాయలు కావాలి" అన్నాడు.

వెంటనే తీసియిచ్చింది చంపకం.

కుందన్ బజారుకెళ్ళి రెండు పెద్దబొమ్మలుకొని పేక్ చేయించి తీసుకు వచ్చాడు.

చంపకం చూసింది కాని అతడినేమీ అడగలేదు. తను అక్కడికి వెళ్ళ దలచుకోలేదు.

ఆ యింటిపేరు స్వర్ణదీవి. పెద్దతోటలో షామియానాలేయించి కుర్చీలూ బల్లలూ వేశారు. పిల్లలు ఒక్కొక్కళ్ళే వస్తున్నారు. భోజనాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

పిల్లలిద్దరూ ఆడపిల్లలని తెలుసు. కాని వాళ్ళపేర్లకోసం అతిథులలో ఒక రిని అడిగి వాళ్ళపేర్లు పేకెట్లమీద రాసి గుంపులోకెళ్ళి కుర్చీలమీద కూర్చున్న పిల్లలకు ఇచ్చాడు కుందన్.

పిల్లలు అతడి చేతిని ముద్దుపెట్టుకుని థాంక్యూ అన్నారు.

ఆ పిల్లలిద్దరు అతడు కొనితెచ్చిన బొమ్మల మాదిరిగా బొద్దుగాఉన్నారు. వాళ్ళచేతులూ బుగ్గలూ చూస్తుంటే అతడికెంతో వింతగా ఉంది. వాళ్ళను ఎవరూ చూడకుండా ముట్టుకుని చూశాడు. మెత్తగా ఉన్నాయి. బుగ్గలు పాలుకారు తున్నట్లున్నాయి. కళ్లు తిప్పుకోకుండా వాళ్లనేచూస్తు చాలాసేపు నిలబడిపోయాడు.

వాళ్లు నవ్వుతుంటే అతడికి ఆశ్చర్యంగా ఉంది. సంతోషంగా ఉంది. ముద్దుగా ఉంది. వాళ్ళకు దగ్గరగా ఒకకుర్చీలో కూర్చున్నాడు.

నౌకర్లు వడ్డించిన ప్లేట్లను పిల్లలందరికీ అందిస్తున్నారు. కుందన్‌వాళ్లకు దగ్గరగా కూర్చుని భోజనం చేశాడు.

"నీ పేరు చెప్పు పాపా ?" అడిగాడు ఆపుకోలేక.

"సుధ"

"నీపేరు ? రెండవ అమ్మాయిని చూసి ప్రశ్నించాడు బుగ్గలునొక్కుతూ.

"మధు"

''బలేపేర్లు. బాగున్నాయి. మీకు పాటలువచ్చా ? పాడండి చూద్దాం" అతడికి కొత్తపిల్లలన్న భావం తోచటంలేదు."

వాళ్లకీ అతడంటే ఇష్టంగా ఉంది. కీచుమని అరుస్తూ ఏవో నర్సరీపాటలు పాడారు. కుందన్‌కి అర్థంకాలేదు.

అయినా సంతోషంతో మురిపెంగా విన్నాడు.

"డాన్సు వచ్చా" అడిగాడు నవ్వుతూ

''ఆఁ ఇద్దరికీ వచ్చు'' అంటూ ఇద్దరూ గంతులువేస్తూ ఎగురుతూ డాన్సు చేశారు.

చిన్నపిల్లలనే చూసి ఎరగని కుందన్‌కి ఆ కదలికలూ, పాటలూ ఆటలూ మాటలూ విస్మయాన్ని కలిగిస్తున్నాయి. వాళ్లమీద అభిమానంలాంటిది కలిగింది. వాళ్లను అప్పుడప్పుడువచ్చి చూడాలన్న కోరిక ఉదయించింది.

అందరూ ఇళ్లకు వెళ్ళేటప్పుడు చాకొలెట్లు బిస్కెట్ల పాకెట్లు ఇచ్చింది శకుంతల. ఆమె కుందన్ పిల్లలతో మాట్లాడటం. ఆడించటం, పాడించటం కళ్లారా చూసింది. ఆనందబాష్పాలు కళ్ళల్లో నిలిచాయి. లోపలగదిలో ఉన్న సుమిత్రా నందన్ను కూడా తీసుకువచ్చి చూపించింది. ఇద్దరూ కళ్ళతో చూసి మురిసి పోయారు. వాళ్లు ముగ్గురూ తమ పిల్లలు!

శకుంతల కుందన్‌కి బిస్కెట్లు చాకొలెట్లూ ఇచ్చే టప్పుడు రెండు చేతులతో కుందన్ను దగ్గరికి తీసుకుని తలమీద ముద్దు పెట్టుకోగానే ఒక విధమైన ఆత్మీయ తకు లోనైనాడు. తనకు వీలున్నప్పుడు స్వర్ణదీవికి సుధా మధులను చూడటానికి వెళ్తున్నాడు. వాళ్ళకు పళ్ళు చాకొలెట్లూ తీసుకు వెళ్తాడు. వాళ్ళతో ఆటలూ పాటలూ డాన్సులతో కాలక్షేపం చేస్తాడు. శకుంతల కనబడినప్పుడు తన స్నేహితుల తల్లులను చూసినట్టే అనిపిస్తోంది. మరింకేదో మనసులో పొంగుతున్నట్లనిపిస్తోంది. ఆమె పలకరిస్తే మాట్లాడతాడు. ఒకోరోజు ఆమె భోజనం చేయమంటుంది. సుధా మధుల మధ్య కూర్చుని భోజనం చేస్తాడు.

అంతకు తప్ప ఆమె ఇంకేమి అతడి స్వవిషయాలు అడగదు.

ఇంటికి వచ్చిన తరువాత చంపకంతో ఆ మాటలేం చెప్పడు. పరీక్షలకు చాలా శ్రద్ధగా చదువుతున్నాడు.

ఆ రోజున హఠాత్తుగా అలా జరిగింది. సుమిత్రానందన్ చంపకం ఇంట్లో నుంచి బయటికి వస్తున్నాడు. కుందన్ లోపలికి వెళ్తూ తలఎత్తి చూశాడు.

సుమిత్రానందన్ ఊరినుంచి వచ్చిన తరువాత చంపకం ఇంట్లో కుందన్‌కి కనబడలేదు. ఆయనను చూడగానే కుందన్‌కి కనుబొమలు ముడిపడ్డాయి.

''ఏమోయ్. నేను జ్ఞాపకం ఉన్నానా?'' అడిగాడు సుమిత్రానందన్.

"చూసి చాలా రోజులయినా మిమ్మల్ని మరిచిపోలేను లెండి" అంటూ లోపలికి దూసుకుపోయాడు.

నవ్వుతున్నాడు సుమిత్రానందన్. కాని కడుపులో బాధగానే ఉంది.

'వీడిని ఇంటికి కొడుకుగా తీసుకుపోవటమెట్లా'?

ఇది ఒక చిక్కుప్రశ్నగా నిలిచి పోతుందా ?

కుందన్‌కి పరీక్షలయ్యాయి. ఆ రోజున పరీక్షలు బాగా రాశానన్న సంతోషంతో ప్లేగ్రౌండంతా తానేఅయి గంతులు వేస్తున్నాడు కుందన్. ఒక పక్కగా పిల్లలు కొందరు క్రికెట్ ఆడుతున్నారు. క్రికెట్ బంతి ఎటునుంచో వచ్చి కుందన్ తలమీద గట్టిగా తగిలింది. అమ్మో అంటూ పడిపోయాడు.

ఆ సమయంలో శకుంతల ఉదయం పదకొండుగంటలకు ఆ రోడ్డు మీదుగా నర్సింగ్ హోమ్‌కి వెళ్ళుతున్నది ప్లేగ్రౌండులో పిల్లలు గుంపులుగా చేరి కుందన్ చుట్టూ మూగారు. ఏమయిందో చూడాలని శకుంతల కారు ఆపుచేసి, దిగి వచ్చి చూడగా కుందన్ తలమీద రెండు చేతులూ పెట్టుకొని కళ్ళు మూసుకుని నేలమీద పడున్నాడు మూలుగుతూ.

అతడిని రెండు చేతులతో అడ్డంగా పట్టుకుని కారులో పడుకోబెట్టుకొని నర్సింగ్‌హోమ్‌కి తీసుకువెళ్ళి బల్లమీద పడుకోబెట్టి చూసింది తలమీద పెద్ద బొప్పి కట్టింది. చర్మం చిట్టి రక్తం చిమ్మింది.

"భయపడకు. మందులేస్తాను అంటూ బొప్పి కట్టినచోట తల వెంట్రుకలు కత్తిరించి స్పిరిట్‌తో తుడిచి రెండు కుట్లు వేసింది. అతడి నోట్లో వేడి వేడి కాఫీ పోసింది.

"అబ్బాయీ, నీవు కూడ కొంత సేపు బల్లమీదనే ఉండాలి. నొప్పి తగ్గటానికీ నిద్రపట్టటానికీ ఒక మాత్ర యిస్తాను తీసుకో" మని ఇచ్చింది శకుంతల.

"నేను ఇవాళ ఒక గంట సేపు ఉంటాను. నేను వస్తుంటే ఒక అబ్బాయి తలకు క్రికెట్‌బాల్ తగిలి నేలమీద పడ్డాడు అతడికి అవసరమైన వైద్యం చేశాను. ఒక గంట తరువాత తీసుకుపోయి వాళ్ళింట్లో విడిచిపెట్టి ఇంటికి వెళ్తాను" పక్కగదిలోకి ఫోను చేసింది.

"పెద్దదెబ్బా?"

"కాదుగాని బొప్పి కట్టింది. చర్మం కొద్దిగా చిట్లింది. కుట్లు వేశాను."

"తేరుకున్నాడా?" మాటలో ఆదుర్దా కనబడుతున్నది.

"ఆఁ కాఫీకూడా ఇచ్చి మాత్ర ఇచ్చాను." ఆమె ఫోను పెట్టేసి టేబుల్ దగ్గరికొచ్చి "బాబు ఎట్లా ఉంది? నొప్పి ఎక్కువగా ఉందా? మీ వాళ్లెవరయినా ఇక్కడున్నారా? మీ యిల్లెక్కడ చెబితే దింపి వెళతాను" అన్నది.

"ఇక్కడుంటే తగ్గినట్టుగా ఉంది. మీరు వెళ్ళిపోతే నాకు ఎక్కువవు తుందేమోనని భయంగా ఉంది" అన్నాడు కళ్లు తుడుచుకుంటూ.

"అయితే మాయింటికిరా నాతో, మా పిల్లల గదిలో పక్క వేయిస్తాను. నీకు వెంటనే అన్నం పెట్టిస్తాను. పడుకుంటే నిద్ర పడుతుంది. నేను కూడా ఆ గదిలోనే ఉంటాను-నీకు తగ్గే వరకూ సరేనా?''

పిల్లలున్నారనగానే వాళ్ళింట్లో ఉండాలని పించింది కుందన్‌కి. ఉంటానని తల ఊపాడు.

ఆమె అతడిని ఇంటికి తీసుకువెళ్లి వేడి వేడి అన్నం పెట్టి పక్క లేయించీ పడుకో బెట్టింది. ఆ గదిలోనే మధూ సుధా కూడా భోజనాలు చేసి పడుకున్నారు. కుందన్ కనబడగానే 'గుడ్‌నైట్' అన్నారు.

అతడు కళ్లుతెరిచి చూచి నవ్వాడు.

శకుంతల అక్కడే కుర్చీ వేసుకుని కూర్చుంది.

కుందన్ నొప్పితో అమ్మా అంటూ మూలుగుతున్నాడు. శకుంతల దిగ్గున లేచి "పడుకో నాయనా! తగ్గిపోతుంది" అంటూ అతడి పక్కమీద కూర్చుని నుదుటి మీద రాస్తూ కళ్లు మూసాడా లేదా అని చూస్తున్నది. తన రెండు చేతులతో ఆమె చేతిని గట్టిగా పట్టుకుని నొప్పి నొప్పి అంటున్నాడు కుందన్.

శకుంతల అతడి నుదుటిమీద రాస్తూ అట్లాగే అతడి పక్కమీద వాలి పోయింది. కుందన్ ఆమె చేతులు వదలిపెట్టి మెడను రెండుచేతులతో చుట్టేశాడు, నిద్రమత్తులో.

"పడుకోబాబూ. నిద్ర వస్తుంది. నిద్రలోనే నీకు నొప్పి పోతుంది" ఆమె అతడిని గుండెకు హత్తుకుంది.

సుమిత్రానందన్ వచ్చి పరదా తొలగించి తొంగి చూచాడు-ఒకరి కొకరు హత్తుకుని పోయిన తల్లీ కొడుకులను.

"వీడు తెల్లవారగానే నొప్పి తగ్గిపోయిందని వెళ్లిపోతాడు కాబోలు" చిన్న బోయిన ముఖంతో ఇటూ అటూ తిరుగుతున్నాడు సుమిత్రానందన్ తనగదిలో.

గాఢనిద్రలోఉన్న కుందన్ కదిలితే లేస్తాడేమోనని జంకుతోంది శకుంతల.

తెల్లవారింది.

శకుంతల కుందన్‌కి ఒంటినిండా బట్టకప్పి మెల్లగా లేచి వెళ్లింది

తెల్లవారి ఏడుగంటలకు కొద్దిగా నొప్పి ఉన్నప్పటికీ ఎన్నడూ ఎరగనంత నిద్ర-అనిద్రలో ఎంతో ఆత్మీయతనూ హాయినీ తృప్తినీ అనుభవించినట్లయి లేచి కూర్చున్నాడు. నౌకరునడిగి బాత్‌రూమ్‌కి వెళ్ళి ముఖం కడుక్కున్నాడు.

కాఫీ టిఫిన్‌కు రమ్మని నౌకరు పిలవగానే భోజనాల యింట్లోకి వెళ్ళి కుర్చీమీద కూర్చున్నాడు. సుధా మధూలు చెరొకపక్కన కూర్చుండగా కాఫీ ఇడ్లీ తీసుకున్నాడు. గదిలోకి వెళ్ళి తల చేత్తో దువ్వుకున్నట్టుచేసి, కాళ్లకు షూజ్ వేసు కొని సిద్ధంగా ఉన్నాడు వెళ్లిపోవటానికి.

శకుంతల రాగానే "నేను ఇంక వెళ్తానండి. నేను టైప్ రైటింగ్ ఇన్స్టిట్యూట్ కి వెళ్లాలి. ఈ సెలవుల్లో కొంత స్పీడ్‌ను అలవరచుకోవాలి. నిన్న మీకు చాలా శ్రమ ఇచ్చాను. పైగా రాత్రంతా ఇక్కడే ఉన్నాను. బిల్లు ఇవ్వండి. నేను డబ్బు తెచ్చి యిస్తాను" అన్నాడు వినయంతో.

"నేను డబ్బుకు మందిచ్చేదాన్ని కాదు బాబూ. నాకు పిల్లలకు వైద్యం చెయ్యటమంటే చాలా ఇష్టం."

"అందుకే కాబోలు ప్లేగ్రౌండులో పడిన వాడిని మీ కారులో తీసుకువెళ్ళి వైద్యంచేసి రాత్రంతా మీ యింట్లోనే ఉంచుకున్నారు. తెల్లవారగానే కాఫీ ఇడ్లీ కూడా ఇచ్చారు. అందుకు నేను కృతజ్ఞుడను. కాని డబ్బివ్వకుండా వైద్యం చేయించుకునే అలవాటు నాకులేదు. మీరు బిల్లు అడిగించుకుంటున్నారు. ఇంకొకళ్ళయితే నిలబెట్టి తీసుకుంటారు. ప్లీజ్ చెప్పండి" బ్రతిమిలాడినట్టుగా అడిగాడు.

"చెప్పానుగా? నేను డబ్బు తీసుకోను. నీ యిల్లెక్కడో చెప్పు. పదకొండు గంటలకు నిన్ను దింపేసి వెళ్తాను. అంతవరకూ ఉండు. భోజనంచేసి బయలు దేరుదాం" అన్నది.

"మీరు డబ్బు తీసుకోకపోతే నా అంతరాత్మ బాధిస్తుందండి. మీరు డబ్బుగా తీసుకోకపోతే పోనీయండి మీ అమ్మాయిలకు చదువు చెప్పి ఋణం తీర్చుకుంటాను."

"అమ్మాయిలకు చదువుచెప్పి తీర్చుకుంటావా ? ఓ. కే. చెప్పు, రోజూ వచ్చి చెప్పు, నా బిల్లు తీరిందని నేను చెప్పే వరకూ చదువు చెప్పు. ఒక్క రోజయినా నాగా పెట్ట కూడదు. నీకు పరీక్షలు వచ్చినప్పుడు వదలిపెడతాను" అంది గంభీరంగా.

ఎప్పుడూ నవ్వుతూ ఆప్యాయంగా మాట్లాడే ఆమె అంతలోకి గంభీరంగా ముఖం పెట్టటం గమనించిన కుందన్ తనూ గంభీరంగా "అలాగే నండి" అన్నాడు. మళ్ళీ కొంత సేపాగి "రేపటి నుంచీ వస్తానండి" అన్నాడు.

అతడు ప్రతిరోజు వెళ్ళి పిల్లలకు చదువు చెబుతున్నాడు. పాటలూ ఆటలూ నేర్పుతున్నాడు. గాలిపటాలు ఎగరవెయ్యటం చూపిస్తున్నాడు. ఆ గాలిపటాల సందర్భంలోనే కాలి బొటనవేలికి దెబ్బతగిలి రక్తంకారింది. శకుంతల వచ్చి వేలంతా కడిగి ఇంజక్షను ఇచ్చింది. ఆబిల్లు తీరకముందే వానలో తడిసినందువల్ల జ్వరం వచ్చింది. వారంరోజుల జ్వరానికి మందులకు టానిక్కులకూ బిల్లు పెరిగిపోయింది.

ఈ అప్పు ఇలా పెరుగుతుండగానే అతడు ఆ ఊళ్ళోనే ఇంటర్ నుంచి బి.యస్సీ, యమ్.యస్సీ చేసి పి.ఎచ్.డి చెయ్యటానికి ప్రారంభించాడు.

సుమిత్రానందన్ కుందన్ ఎప్పుడు వచ్చినా, భోజనం చేసినా రాత్రిళ్ళు పడుకున్నా అతడికి తెలియనట్టుగానే ఉంటున్నాడు గదిలోనుంచి బైటికిరాకుండా.

ఇంతకూ బిల్లు ఎంత తీరిందో- లేక ఎంత పెరుగుతున్నదో శకుంతల ఇంకా అతడికి చెప్పలేదు.

చంపకం తనబాధ్యత తీరిపోయిన దనుకుంటోంది గాని కుందన్ తన గది ఖాళీచెయ్యలేదు. అక్కడే ఉండి చదువుకుంటున్నాడు. అడిగినప్పుడల్లా డబ్బు ఇస్తుంది. పడక భోజనం అక్కడే.

అతడి ఎడ్రస్ కేరాఫ్ శ్రీమతి చంపకం గానే ఉంది. బిల్లు తీరిందని శకుంతల చెప్పేవరకూ పిల్లలకు చదువు చెప్తునే ఉన్నాడు. ఆ పిల్లలు అతడిని

వదలిపెట్టటంలేదు. వాళ్ళను చూడనిదీ అతడికీ తోచటంలేదు. సినిమాలకు కూడా వాళ్ళను తీసుకువెళ్తున్నాడు.

ఆ ముగ్గురి మధ్య మమతలపందిరి అల్లుకుంటోంది.

పుట్టినరోజు గుర్తుపెట్టుకుని బహుమానాలు తీసుకువెళ్తాడు.

మర్యాదకు పలకరించినా అతడి మనసులో సుమిత్రానందన్ "ఆయన" గానే నిలిచిపోయాడు. శకుంతల బాగా పరిచయంగల డాక్టరుగా మిగిలిపోయింది.

ఒకరోజున "అంటీ, నాకు ఫారెన్‌స్కాలర్‌షిప్పు వచ్చింది. ఒక నెలలో వెళ్తాను" అన్నాడు చంపకంతో.

"చాలా సంతోషం బాబూ. సుధా మధూలకు చెప్పావా వాళ్ళ యింటికి వెళ్ళి?" అడిగింది చంపకం.

''వెళ్ళాలి, సాయంత్రం వెళతాలే ?"

సాయంకాలం అతడు వెళ్ళేసరికి అందరు ఇంటిముందరే కూర్చున్నారు. ఆదివారం కనక నర్సింగ్‌హోం ఉదయం పూట మాత్రమే తెరిచి ఉంటుంది.

"సుధా ! మధూ ! నాకు ఫారెన్ స్కాలర్‌షిప్పు వచ్చింది. ఈ నెలలో వెళ్తాను" అన్నాడు వాళ్లపక్కన కూర్చుంటూ.

"మళ్ళీ ఎప్పుడు వస్తావు?" ఇద్దరూ అతడి చేతులను పట్టుకు లాగుతున్నారు.

కుందన్ శకుంతలను చూసి "మీ బిల్లు ఎంతో చెప్పకుండానే కాలం గడిపేస్తున్నారు. మరి నేను విదేశాలకుకూడా వెళ్తున్నాను" అన్నాడు.

ఈ పూట ఇక్కడ మాతో భోజనం చెయ్యి. నీవు తిరిగి వచ్చేవరకూ బిల్లును పెండింగ్‌లో పెడతాను. నీవు వచ్చిన తరువాత బిల్లు ఎంతయినదీ ఎట్లా తీర్చవలసిందీ చెబుతాను" అంది.

ఆ రాత్రి అక్కడే భోజనం చేశాడు. సుమిత్రానందన్ కూడా పంక్తిలో ఉన్నాడు.

''ఇన్నాళ్లనుంచీ ఇక్కడికి వస్తూపోతున్నాను. మీరు ఇంట్లో కనబడలేదు. నా ప్రయాణం సంగతి వింటున్నారుగా ?" అన్నాడు కుందన్ ఆయనతో.

"అవును బాబూ, నేను ఈ యింటి యజమానిని. అయినా నా హోదానూ గౌరవాన్నీ అందరూ తెలుసుకోవాలన్న ప్రయత్నం చేయలేని అసమర్థుడిని. మాటవరసకు నేను నీ తండ్రిననుకో. ఎప్పుడైనా నీతో చెప్పానా ? లేదు. ఏదే శాలలో అంతకాలం ఉన్నందువల్లనే నేను నా అర్హతను హక్కునూ పోగొట్టు కున్నానేమో ననుకుంటాను. నీవు మాత్రం ఆ విధంగా చేయవద్దని నాకోరిక నీవు అంగీకరించినా అంగీకరించకపోయినా మేమిద్దరం నీ తల్లిదండ్రులము. చంపకం మీ తల్లికి చెల్లెలు వంటిది. ఇదీ పరిస్థితి. నీవు నమ్ముతావో లేదోమరి ? అది నీ యిష్టం" అంటూ కళ్ళు తుడుచుకున్నారాయన.

"నీవు మా అన్నయ్యవు. నీవు ఇక్కడే ఉండాలి. మాతో ఆటలు పాట లతో కాలక్షేపం చెయ్యాలి. మేము వెళ్ళనివ్వం" మధూ సుధా అతడిని చుట్టివేశారు. అతడు ప్రయాణమయ్యేవరకూ కదలనీయలేదు. తల్లినడిగి కారు తీసుకుని బజా రుకి వెళ్ళి అన్నయ్యకు బట్టలు కుట్టించారు. అతడికి కావలసిన వస్తువులను కొనిచ్చారు.

"అమ్మా, నాన్నా, మనం బొంబాయివరకూ వెళ్ళి అన్నయ్యను విమానం ఎక్కిద్దాం'' అని ఊపిరాడనివ్వకుండా చేశారు.

కుందన్ వెళ్ళుతుంటే తల్లిదండ్రులిద్దరూ "నాయనా ! క్షేమంగా పోయి లాభంగా రా" అంటూ అతడిని గుండెలకు హత్తుకున్నారు.

కుందన్‌కి నోటినుంచి మాట రావటంలేదు. ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయిపోయాడు. కళ్ళు తుడుచుకుంటూ పిల్లలను ముద్దుపెట్టుకున్నాడు. నాన్నా అమ్మా అంటూ వాళ్ల చేతులను నుదిటికానించుకున్నాడు.

ఇది ఒక విచిత్రమైన సంఘటనగా అతడి మనసులో నిలిచిపోయింది.